సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 28 । మే । 2025

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.114
రెండోరకం	రూ.70	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1757 మెట్రిక్ టన్నులు



రాయలసీమకు రిక్తహస్తం

- కడప అభివృద్ధి కోసం పసుపు పండుగని చెప్పుకొచ్చిన టీడీపీ
- సీఎం చంద్రబాబు ప్రసంగంలో నోచుకోని ప్రణాళికలు
- ఊకదంపుడు ఉపన్యాసంతో సరిపెట్టిన వైనం
- ఆత్మస్తుతి, పరనిందకే ప్రాధాన్యత



మహానాడులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

సాక్షి ప్రతినిధి, కడప: మహానాడులో చంద్రబాబు.. తెలుగు తమ్ముళ్ల పరువు తీసి రోడ్డున పడేశారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డా కడపలో మహానాడు పెడుతున్నాం. ఇక అన్నీ మారిపోయాయి.. రాయలసీమ రూపురేఖలు రేపటి నుంచి మారిపోతాయి' అంటూ తెలుగుదేశం నేతలు బీరాలు పలికారు. మహానాడు సందర్భంగా.. ఏ వేదిక దొరికినా, ఇదే అంశాన్ని ఊదరగొట్టారు. తీరా మహానాడులో చంద్రబాబు రాయలసీమ అభివృద్ధి అంశాన్నే పక్కన పెట్టడంతో.. టీడీపీ నేతలు తల పట్టుకుంటున్నారు.

వైఎస్సార్, జగన్ చేసిన అభివృద్ధిని.. ఖాతాలో వేసుకునే యత్నం..

'కడప ఇక ఎవరి అడ్డా కాదు.. టీడీపీ వారి అడ్డా' అంటూ బీరాలు పలికిన టీడీపీ నేతలు మరో అడుగు ముందుకు వేసి.. ఈ మహానాడు రాయలసీమ రూపురేఖలనే మార్చబోతోందంటూ ప్రగల్భాలు పలికారు. ఈ మహానాడులో రాయలసీమ అభివృద్ధికి తమ అధినేత చంద్రబాబు ఎన్నెన్నో ప్రకటనలు చేయబోతున్నారంటూ.. మీడియా ముందు ఊదరగొట్టేశారు. మరో అడుగు ముందుకు వేసి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు కడప జిల్లాలో చేసిన అసామాన్యమైన అభివృద్ధిని కూడా తమ ఖాతాలోనే వేసుకున్నారు. సీమ, కడపను అభివృద్ధి చేయాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యం అంటూ గొప్పగా డప్పాలు కొట్టుకున్నారు. తీరా మహానాడు ప్రారంభమైంది. తమ అధినేత చంద్రబాబు యథావిధిగా తనదైన శైలిలో పాత చింతకాయపచ్చడి ప్రసంగాన్ని బయటకు తీశారు. గత పదిహేనేళ్లుగా చెబుతున్న.. 'రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా, ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తాను' అంటూ ఊకదంపుడు ఉపన్యాసం చెప్పి ముగించేశారు. వెరసి తెలుగు తమ్ముళ్లకు నోట్లో వెలక్కాయ పడ్డట్లయింది. తమ అధినేత రాయలసీమ అభివృద్ధికి ఎన్నెన్నో చేస్తారని, కనీసం మాటలైనా చెప్తారని ఆశపడ్డ సీమ నేతలకు చంద్రబాబు ప్రసంగం మింగుడుపడటం లేదు.

పథకం పేరు	పూర్తి చేసిన వారు	ప్రారంభించిన వారు
గండికోట ప్రాజెక్టు	డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి	డాక్టర్ వైఎస్సార్
వామికొండ ప్రాజెక్టు	డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి	డాక్టర్ వైఎస్సార్
సర్వారాయసాగర్ ప్రాజెక్టు	డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి	డాక్టర్ వైఎస్సార్
వెలుగల్లు ప్రాజెక్టు	డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి	డాక్టర్ వైఎస్సార్
బ్రహ్మంసాగర్	డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి	సోనియాగాంధీ
పైడిపాలెం ప్రాజెక్టు	డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి	చంద్రబాబునాయుడు

పైడిపాలెం ప్రాజెక్టును కూడా..

టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే 15 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేశారు. జిల్లాలో చెప్పుకొనేందుకు కూడా ఆయన చేపట్టిన ప్రధాన అభివృద్ధి అంటూ లేదు. పైగా మంజూరైన ఉర్దూ యూనివర్సిటీని కర్నూలుకు తరలించారు. ఆ స్థానంలో హజ్ హౌస్ మంజూరు చేశారు. చెప్పుకునేందుకు నిర్దిష్టమైన అభివృద్ధి అంటూ ఏదీ లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. పైడిపాలెం ప్రాజెక్టును ముఖ్యమంత్రి హోదాలో ప్రారంభించినప్పటికీ.. ఆ పనులను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 95 శాతం పూర్తి చేశారు. మిగిలిపోయిన పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు ప్రారంభించారు. అంతకు మించి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి గురించి చెప్పుకొనేందుకు అస్కారమే లేదని పలువురు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహానాడులో ఆత్మస్తుతి, పరనిందకు పరిమితమయ్యారని విశ్లేషకులు భావిస్తున్నారు.

» ప్రతిష్టాత్మక విద్యా సంస్థలన్నీ 'వైఎస్' హయాంలోనే..

యోగివేమన యూనివర్సిటీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలు, ట్రిపుల్‌ఐటీ, రిమ్స్ మెడికల్, డెంటల్ కళాశాలలు మంజూరు చేసి పూర్తి చేశారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా క్యాన్సర్ హాస్పిటల్, సూపర్ సెష్పాలిటీ వైద్యశాల, 100 పడకల మానసిక వైద్యశాల, పుష్పగిరి ఐ హాస్పిటల్, డాక్టర్ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్, ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, పులివెందులలో మెడికల్ కళాశాల, వైద్యశాల ఏర్పాటు చేశారు. చెప్పుకొనేందుకు సీఎం చంద్రబాబుకు ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రతిష్టాత్మకమైన సంస్థ జిల్లాలో లేకపోవడం గమనార్హం.

» అభివృద్ధిని కొనసాగిస్తామని కూడా చెప్పలేని దుస్థితి..

రాయలసీమ అభివృద్ధి కాదు కదా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వాటిని కొనసాగిస్తానన్న ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మరోవైపు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు గతంలో చంద్రబాబు రాయలసీమకు ఇచ్చిన హామీలను ప్రశ్నించడం మొదలుపెట్టారు. విభజన హామీల్లో భాగంగా కడప ఉక్కు సంగతేంటని వారు ప్రశ్నిస్తుంటే.. చంద్రబాబు మాత్రం ఆ ఒక్కటీ అడక్కు అన్నట్లు ఆ విషయాన్నే మాట్లాడలేదు. దీనికి తోడు ఇప్పటికే పులివెందులకు వచ్చిన 50 మెడికల్ సీట్లను వెనక్కు పంపడం, కొప్పర్తి ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతి తరలించుకుపోవడం, రాయలసీమ గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని రాజధానికి తరలించుకుపోవడం వంటి అంశాలపై రాయలసీమ ప్రజలు ఇప్పటికే ఉద్యమాలు చేస్తున్నారు. ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్, ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఇక్కడే ఉంచుతానని మైదుకూరు సభలో హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఈ మహానాడులో వాటి గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ప్రభుత్వం మారడంతో ఆగిపోయిన అమృత్ స్కీంలో భాగంగా రూ.500 కోట్లతో మాజీ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన మంచినీటి ప్రాజెక్టు, కడపలో నిర్మిస్తున్న ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ నిధులు వంటి ఎన్నో అంశాలను చంద్రబాబు ప్రస్తావించనే లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఏదో అత్యుత్సాహంలో రాయలసీమ రూపురేఖలే మారిపోతాయని మంత్రులు, ఎమ్మెల్యేలు బీరాలు పలికితే.. వారి ఆశలపై చంద్రబాబు నీళ్లు పోశారు. ఇప్పుడు రాయలసీమ వాసులకు ఏం సమాధానం చెప్పాలో అంటూ తెలుగు తమ్ముళ్లు లోలోన మథన పడిపోతున్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

టీడీపీది మహా దగా

- కూటమి ప్రభుత్వం వచ్చాక దుష్ట సంప్రదాయం మొదలు
- మహానాయకుల విగ్రహాలకు టీడీపీ జెండాలు కట్టడంపై భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం, నిరసన



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను దగా చేసి మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. మహానాయకుల విగ్రహాలకు టీడీపీ జెండాలు, తోరణాలు కట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు సమీపంలోని వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి వారు క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడపలో దుష్ట సాంప్రదాయానికి తెరతీశారన్నారు. మహానాడు సందర్భంగా డా. బీఆర్ అంబేడ్కర్, అశోకచక్ర, మహాత్మా గాంధీ, పొట్టిశ్రీరాములు, అన్నమయ్య, శ్రీక్రిష్ణ దేవరాయల విగ్రహాలకు పచ్చ తోరణాలు కట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఏం ఉద్ధరించారని మహానాడు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల ముందు 160 హామీలు ఇచ్చి, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. పోలీస్ బందోబస్తు లేకపోతే ప్రజలు వీరిని చొక్కా పట్టుకొని నిలదీస్తారన్నారు.

- వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, షఫీ, దాసరి శివప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, యానాదయ్య, సీహెచ్ వినోద్, బంగారు నాగయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, త్యాగరాజు, జమాల్‌వలీ, బండి ప్రసాద్, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, బండి మరియలు, సునీత, మల్లీశ్వరి, తులశమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు క్షమాపణ చెప్పండి: అంజద్‌బాషా

ఎన్నికల హామీలు నెరవేర్చనందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడు వేదికగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఎద్దేవా చేశారు. మహానాడు సందర్భంగా టీడీపీ నాయకులు స్వాతంత్ర్య సమరయోధులు, మహానాయకుల విగ్రహాలకు పార్టీ జెండాలు కట్టడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఏం సాధించారని, ఏం ఘన కార్యాలు చేశారని మహానాడు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. విభజన హామీలైన ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి వాటిని మోదీ కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. జగన్ అడ్డాలో మహానాడు నిర్వహించామని టీడీపీ నేతలు సంబరపడుతున్నారని, ఇది ఎప్పటికీ జగన్ అడ్డానేనని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

ఒంటరిగా పోటీ చేసి గెలుపొందిన చరిత్ర టీడీపీకి లేదు: సురేష్ బాబు

రాష్ట్ర చరిత్రలో ఒంటరిగా పోటీ చేసి గెలుపొందిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి లేదని మేయర్ సురేష్ బాబు అన్నారు. 2024 ఎన్నికల్లో కూడా బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. కడపలో మహానాడు నిర్వహించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. మహానేత వైఎస్సార్, వైఎస్ జగన్‌ల వల్లే ఈ జిల్లా అభివృద్ధి చెందిందని, దుష్టబుద్ధితో వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చారని మండిపడ్డారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేయాలని మహానాడులో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అధికార, పోలీసు యంత్రాంగం అధికార పార్టీ తొత్తులుగా పనిచేస్తున్నారని, వారం రోజులుగా వారు ప్రజా సమస్యలను గాలికొదిలేసి మహానాడు కార్యక్రమం ఏర్పాట్లలో మునిగి తేలుతున్నారని విమర్శించారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

రాయచోటి: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. పట్టణంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన వైద్యుల వద్దనే గర్భిణులు వైద్య సేవలు పొందాలన్నారు. నాటువైద్యులు, ఆర్‌ఎంపీలను సంప్రదించవద్దని సూచించారు. ఎవరైనా ఆర్‌ఎంపీలు గర్భిణులకు వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లి: మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో గెస్ట్ జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. తమ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆయా సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ కలిగి 50 శాతం పైన మార్కులు కలిగిన వారు అర్హులని చెప్పారు. జూన్ 10వ తేదీలోపు దరఖాస్తులు కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ : 8712625076లో సంప్రదించాలని వివరించారు.

ఎమ్మెల్సీ సీఆర్‌సీ, సుగవాసి డుమ్మా!

- రాయలసీమ బలిజ నేతలకు పొగబెడుతున్న టీడీపీ
- మహానాడుకు దూరంగా ఉండిపోయిన నేతలు



సి.రామచంద్రయ్య



సుగవాసి బాలసుబ్రమణ్యం

సాక్షి ప్రతినిధి, కడప: బలిజ సామాజికవర్గనేతల్ని టీడీపీ విస్మరిస్తోందా...ఎన్నికల్లో వాడుకొని ఆపై ప్రాధాన్యత లేకుండా దూరం పెట్టిందా...అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య, సుగవాసి బాలసుబ్రమణ్యం మహానాడుకు దూరంగా ఉండడమే దీనికి నిదర్శనమని ఉదహరిస్తున్నారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్యది సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం. ఎన్నో పదవులు అలంకరించిన నాయకుడు. మొన్నటి ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం విశేషంగా పనిచేశారు. ఏడాది తిరక్కముందే ఆ పార్టీలో కనుమరుగయ్యారు. దీనికి కారణం తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయిలో ఉండడమే అని తెలుస్తోంది. భవిష్యత్‌లో తమకు అడ్డుగా నిలుస్తారనే అభద్రతాభావంతో స్థానిక నేతలు ఎన్నికల వరకు వాడుకొని వదిలేసినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో అధికారిక కార్యక్రమాల్లో రామచంద్రయ్యకు ప్రాధాన్యత లభించలేదు. దీంత ఉనికి కోసమే పార్టీలో ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే పార్టీ పసుపు పండుగగా చెప్పుకుంటున్న మహానాడుకు గైర్హాజరయ్యారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

» హీరోగా ఉన్న చోటే జీరోగా ఉండలేక....

సుగవాసి పాలకొండ్రాయుడు సీఎం చంద్రబాబుకు రాజకీయ సమకాలికుడు. రాయచోటి నుంచి 1978, 83, 99, 2004 రాయచోటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984–89 కాలంలో రాజంపేట ఎంపీగా ఎన్నికయ్యారు. రాయచోటిలో ఎన్నికలంటే ప్రధానంగా మండిపల్లి, సుగవాసి కుటుంబాల మధ్య ప్రత్యక్ష యుద్ధం నడిచేది. అలాంటిది మొన్నటి ఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టికెట్ ఇచ్చినా సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబం తెలుగుదేశం పార్టీ ఉన్నతికి పనిచేసింది. ఎన్నికల తర్వాత సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులను ఆ పార్టీ దూరంగా పెట్టింది. బాలసుబ్రమణ్యానికి కనీసం ఇన్‌ఛార్జీ పదవి కూడా అప్పగించలేదు. మరోవైపు పాలకొండ్రాయుడు మృతి చెందితే సీఎం చంద్రబాబు స్వయంగా పరామర్శించిన దాఖలాలు కూడా లేవు. ఇలాంటి చర్యలు పరిశీలిస్తే రాయలసీమ బలిజలను వ్యూహాత్మకంగానే దూరం పెడుతోన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా పార్టీ అధినేతతో సహా కడప గడపలో మహామహులు తిష్టవేసినా ఆ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారని పలువురు చెప్పుకొస్తున్నారు.

అక్కడ కిక్కు.. ఇక్కడేమో ట్రాఫిక్కు!



మహానాడు వేదిక సమీపంలో మందుతాగుతున్న టీడీపీ కార్యకర్తలు



ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వాహనాలు

- రింగ్ రోడ్డు వెంబడి నిలిచిపోయిన వాహనాలు
- అటు, ఇటుపోలేక ప్రజలకు తిప్పలు

సాక్షి కడప: మహానాడుతో ప్రజలు తిప్పలు పడ్డారు. కడప శివారు చుట్టూ ఎటుపోయినా ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కిచిక్కి విలవిల్లాడారు. వాహనాలు కదలక...అడుగు ముందుకు పడక....ఎటువైపు పోలేక సతమతమయ్యారు. కడప నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ట్రాఫిక్ సమస్యతో అవస్థలు పడుతూ అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. పరిస్థితిని తెలుసుకుని డీఐజీ కోయ ప్రవీణ్, ఇతర పోలీసు అధికారులు వచ్చి ట్రాఫిక్‌ను కొంతమేర క్రమబద్ధీకరించినా తర్వాత మళ్లీ యథాస్థితి నెలకొంది. ట్రాఫిక్ సమస్య టీడీపీ పెద్దలతోపాటు కేంద్ర మంత్రులకూ తగిలింది. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు , పెమ్మసాని చంద్రశేఖర్ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం గమనార్హం. టీడీపీ నేతలు ఇష్టానుసారం వాహనాలు నిలబెడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. పలుచోట్ల టీడీపీ నేతలు ట్రాఫిక్‌ను సరిదిద్దుతున్న పోలీసులపైనే రుసరుసలాడడం కనిపించింది.

మందుబాబులం.. మేము మందుబాబులం...

మహానాడు సందర్భంగా మందుబాబులు ఫుల్ జోష్‌లో కనిపించారు. వైన్‌షాపుల వద్ద ఎక్కువ సంఖ్యలో పచ్చ చొక్కాల వారే కనిపించడం గమనార్హం. ఓ వైపు జనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోగా.. మరోవైపు తమ్ముళ్లు కిక్కులో గడిపారు.



ముఖ్య నేతలు ప్రసంగిస్తున్న సమయంలో బయటికి వస్తున్న టీడీపీ కార్యకర్తలు



పడిపోతున్న కటౌట్లు చూసి పోలీసుల పరుగులు




కార్లపై పడ్డ కటౌట్లు

నైరుతి ఆగమనం.. రైతుల్లో కలవరం

- మొదలైన తొలకరి వర్షాలు
- విత్తన సేకరణలో ఇక్కట్లు
- ప్రభుత్వ ఆర్థిక సాయం కరువు
- చేతిలో డబ్బు లేక అవస్థలు





సబ్సిడీతో అందించనున్న వేరుశగన కాయలు



రాయచోటి: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది త్వరగా అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ నెల 26న రాయలసీమలోకి రావడంతో.. జిల్లాలోనూ పలకరించాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. నైరుతి రుతుపవనాల రాక పట్ల ఓ వైపు సంతోషం వ్యక్తం అవుతోంది. మరో వైపు ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నా.. అవసరమైన విత్తనాల సేకరణ ఆలస్యమవుతోందన్న భయం రైతులను వెంటాడుతోంది. గతేడాది పంటల్లో నష్టం రావడంతో.. చేతిలో చిల్లిగవ్వ లేదు. దుక్కులు, విత్తనాలు, ఎరువుల కోసం ఎక్కడి నుంచి డబ్బులు తేవాలో దిక్కుతెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతు భరోసాను ఇంత వరకు ఇవ్వలేదు. దీంతో వర్షాలు కురుస్తున్నాయన్న సంతోషం కంటే సాగుకు అవసరమైన డబ్బులు ఎలా సంపాదించాలో అర్థంకాని పరిస్థితి రైతులను కలవరపెడుతోంది. సాధారణంగా ఏటా జూన్ 8 నుంచి 12వ తేదీల మధ్య రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశిస్తాయి. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్ పట్ల రైతుల్లో ఆశలు చిగురించాయి.

రుతు పవనాల ప్రభావం

రుతుపవనాల ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జల్లులు కురుస్తున్నాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం మే 26 నుంచి 29 వరకు జిల్లాలో మోస్తరు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేయడంతో అధికారులు కూడా అప్రమత్తమవుతున్నారు.

వాతావరణ పరిస్థితులు

రుతుపవనాల ముందస్తు ప్రవేశం కారణంగా జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులు, గాలివానలు సంభవిస్తున్నాయి. ఈ వర్షాలు పంటల సాగుకు అనుకూలంగా ఉండే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగుకు అనుకూలంగా లోతు దుక్కులు దున్నుకోవాలని సూచిస్తున్నారు.

రైతులకు సూచనలు

రుతు పవనాల ముందస్తు ప్రవేశం ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు చెబుతున్నారు. రైతులు వర్షపాతం మోతాదును బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవడం మంచిదంటున్నారు.

» అవసరం కొండంత.. కేటాయింపులు గోరంత

ఖరీఫ్ సాగుకు అవసరమైన వేరుశనగ విత్తన కాయల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రైతులకు అవసరమైన విధంగా జిల్లాకు 45 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు సబ్సిడీపై అందించింది. ఈ ఏడాది కేటాయింపులోనే ఆలస్యమవుతూ వస్తోంది. మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా.. అందుకు అనుగుణంగా విత్తన కాయల కేటాయింపు చేపట్టలేదు. రెండు రోజుల కిందట అన్నమయ్య జిల్లాకు 26 వేల క్వింటాళ్ల విత్తన కాయలను కేటాయిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 65 వేల హెక్టార్లలో సాధారణ సాగు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా జిల్లాలోని రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి ప్రాంతాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తారు. సాగుకు అనువుగా విత్తనపు కాయలను రైతులు సిద్ధం చేసుకుని సీజన్ ప్రారంభంలో విత్తుకునేలా చూడాలని కోరుతున్నా.. ఆ దిశగా అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో రూ.15 లక్షలు జరిమానా

తంబళ్లపల్లె : చెక్ బౌన్స్ కేసులో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తికి రూ.15లక్షలు జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఉమర్‌ఫారూఖ్ తీర్పు ఇచ్చారు. బెంగళూరుకు చెందిన లోకనాథరెడ్డి 2018లో తంబళ్లపల్లె వాసి రామమూర్తికి ఇచ్చిన చెక్ బౌన్స్ అయింది. బాధితుడు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు. బాధితుడి తరపున న్యాయవాది గఫార్ కేసు వాదనలు వినిపించారు. విచారణ పూర్తయి నేరం రుజువు కావడంతో లోకనాథరెడ్డికి రూ.15 లక్షలు జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ప్రభుత్వ భూమి కబ్జా.!



రెడ్డిపల్లిలో ఆక్రమణ భూమిలో స్తంభాలు నాటిన దృశ్యం

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ భూములను కొందరు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 400 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. యథేచ్ఛగా భూముల్లో చెట్లు నాటుకొని పంటలు సాగు చేస్తున్నారు. పూర్వ కాలం నుంచి గ్రామంలో చనిపోయిన వారి భార్యలు గాజు, పూస తీసే భూమిని చిన్న ఓరంపాడు వీఆర్‌ఓ రాంబాబు, వీఆర్‌ఏ రామచంద్రలు ఆక్రమించుకుంటున్నారని మంగళవారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఎల్లయ్య దీనిపై మాట్లాడుతూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. మొక్కుబడిగా ఆర్‌ఐ విచారణ చేపట్టి వీఆర్‌ఓ, వీఆర్‌ఏకు సహకరిస్తున్నారని ఆరోపించారు. తమ ఆక్రమణను అడ్డుకుంటే మీ అంతు చూస్తామని కూటమి నాయకులు బెదిరిస్తున్నారని సర్పంచ్ తెలిపారు. ఈ విషయంపై పుల్లంపేట తహసీల్దార్ అరవింద కిషోర్‌ను వివరణగా కోరగా ఆక్రమణదారులపై తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫ్లెక్సీ పడి టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడికి తీవ్ర గాయాలు

కడప అర్బన్ : మహానాడు ప్రాంగణం సమీపంలో జరిగిన ప్రమాదంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు గాయపడ్డాడు. మోటారు సైకిల్‌పై వెళ్తున్న పెండ్లిమర్రి మండలం పాత సంగటిపల్లెకు చెందిన చెంగ్రాయుడు (52)పై మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఫ్లెక్సీ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ మేనేజ్‌మెంట్ ప్రొద్దుటూరులో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం 01:03 నిష్పత్తిలో ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఉపాధ్యాయులు సంబంధిత ధ్రువపత్రాలతో కడప గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఈనెల 28వ తేదీ హాజరు కావాలని కోరారు.

నిధుల స్వాహా కథ.. కంచికేనా?

- 'సాక్షి' కథనంతో రహస్య విచారణ
- రూ.29.50 లక్షలకు చేతి రశీదులపై జరగని విచారణ
- లీజుదారు డబ్బు చెల్లించకున్నా కొనసాగించిన ఫైనం
- ఈ వ్యవహారంపై ముగింపు పలకలేక మల్లగుల్లాలు?



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె : కథలన్నీ కంచికి చేరుతాయన్న సామెత లాగా.. మదనపల్లె మున్సిపాలిటీలో లక్షల నిధుల స్వాహా కథ కూడా కంచికి చేరేలా కనిపిస్తోంది. మదనపల్లె స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో 2022–23 గుత్తలకు సంబంధించి రూ.29.50 లక్షల నిధులు స్వాహా విషయాన్ని ఈ నెల 14న 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు వారపుసంత, జంతువధశాల, దినసరి మార్కెట్‌ను వేలం ద్వారా రూ.94.55 లక్షలకు గుత్తకు అప్పగించారు. ఈ గుత్త పొందిన లీజుదారుడు చెల్లించిన నిధులు, స్వాహా అంశాన్ని అధికారులు ఇంకా కొలిక్కి తీసుకురాలేదని తెలుస్తోంది.

రెండు రోజులు విచారణ

పైసా సొమ్ము చెల్లించినా ఆన్‌లైన్ ద్వారా జమ చేసి చెల్లింపుదారునికి ఆన్‌లైన్ రశీదులు ఇస్తారు. అయితే ఈ గుత్తకు సంబంధించి రూ.29.50 లక్షల చెల్లింపు జరిగినట్టు, అందుకు చేతిరాత రశీదులు ఇచ్చిన ఉద్యోగి.. ఆపై సొమ్మును మున్సిపాలిటీకి జమ చేయలేదని గుర్తించారు. ఈ విషయం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో అధికారులు రెండురోజుల పాటు విచారణ చేసి ముగించారు. విచారణలో సొమ్ము చెల్లింపుపై స్వాహా చేసిందెవరు, ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంది అనే వివరాలను ఆరా తీయలేదని తెలుస్తోంది. మొత్తం ఆరోపణలకు కేంద్రమైన రశీదులు ఇవ్వడంపై ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ చేస్తే.. వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉండేది.

అనుమానాలు ఎన్నో..

నిధుల స్వాహా రెండేళ్లుగా నలుగుతుండటంపై ఎన్నో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గుత్తల సొమ్ము చెల్లించాల్సిన లీజుదారు నిర్ణయించిన గడువులోగా సొమ్ము జమ చేయకుంటే మూడు నెలల ముందే.. లీజును రద్దు చేసే అవకాశం ఉన్నా, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు. సొమ్ము జమ అయినట్టు చేతిరాత రశీదులు చూపించి లీజుదారు రద్దు నుంచి తప్పించుకున్నారా?.. ఇదే జరిగివుంటే నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారంపై అప్పుడే అధికారులు చర్యలు తీసుకోవాల్సింది. అలా కాకుండా లీజు పూర్తయ్యాక సొమ్ము చెల్లింపు కోసం న్యాయపరమైన చర్యలు చేపట్టడం మున్సిపల్ నిబంధనల మేరకే జరిగిందా? రశీదులు ఇచ్చారంటే సంబంధిత ఉద్యోగి లీజుదారు నుంచి సొమ్ము తీసుకున్నట్టు ఎవరైనా భావిస్తారు. ప్రధానంగా డబ్బు తీసుకున్నట్టు రశీదులు ఇవ్వడం ఈ వ్యవహారంలో కీలకమైంది. కాబట్టి అధికారులు తగిన రీతిలో లీజుదారు, సంబంధిత ఉద్యోగిని విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఇంత పెద్ద మొత్తానికి చేతిరాత రశీదులపై తేలికగా తీసుకోవాల్సిన అంశం కాదని మున్సిపల్ సిబ్బంది చర్చించుకొంటున్నారు.

ముగింపు ఎలా..!

గుత్తల సొమ్ము స్వాహా వ్యవహారానికి ఎలా ముగింపు పలకాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. న్యాయపరమైన చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నా.. స్వాహా విషయాన్ని 'సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో అధికారుల్లో కదలిక వచ్చి, రెండు రోజులు ఉద్యోగులతో రహస్య విచారణ జరిపారు. ఆ విచారణలో ఏమి తేల్చారో బయటకు పొక్కలేదు కానీ.. ఈ స్వాహా కథకు ముగింపు పలకడం కోసం దారులు వెతుకుతున్నట్టు తెలుస్తోంది.

విచ్చల విడిగా పేకాట

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, ములకలచెరువు సరిహద్దు పరిసర ప్రాంతాల్లో విచ్చల విడిగా పేకాట కొనసాగుతోంది. వారానికోసారి జూదరులు ప్రాంతాల వారీగా స్థావరాలు మారుస్తూ పేకాట దర్జాగా కొనసాగిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. జూదరుల అవసరాలను ఆసరాగా చేసుకున్న వడ్డీ వ్యాపారులు సైతం అక్కడే ఉండి అధిక వడ్డీలకు అది కూడా గంటల ప్రకారం ఇస్తూ జేబులు నింపుకుంటున్నారని తెలుస్తోంది. జూదాన్ని అరికట్టాల్సిన పోలీసులు మాత్రం మామూళ్ల మత్తులో ఉన్నారనే ఆరోపణలున్నాయి. వారానికోసారి ఈ పరిసర ప్రాంతాల్లో జరిగే పేకాట రూ.20 లక్షల నుంచి రూ.కోటి దాకా జరుగుతున్నట్లు సమాచారం. పోలీసులు ఇకనైనా స్పందించి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉంది.

ఇంటిని కూల్చిన ఘటనలో కేసు నమోదు

కడప అర్బన్ : కడప శివానందపురంలో వెంకటసుబ్బయ్య ఇంటిని అప్పు తీర్చలేదని బాల గురవయ్య, అతని కుమారులు, అనుచరులతో కలిసి కొన్ని రోజుల క్రితం కూల్చివేశారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పశ్చిమబెంగాల్ సైబర్ నేరస్తుడు మదనపల్లెలో అరెస్టు



సైబర్ నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకెళుతున్న పశ్చిమ బెంగాల్ పోలీసులు

మదనపల్లె రూరల్ : ఉద్యోగాలిప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడంతో పాటు సైబర్ నేరాలకు పాల్పడి మదనపల్లెలో తలదాచుకున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సైబర్ నేరస్తుడిని ఆ రాష్ట్రానికి చెందిన పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కలకత్తాకు చెందిన జిజాన్స్(40) స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ పలువురికి ఉద్యోగాలిప్పిస్తానని నగదు వసూలు చేసుకున్నాడు. అంతేకాకుండా సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. దీంతో అతడిపై ఆరు నెలల క్రితం కలకత్తా పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న జిజాన్స్ మదనపల్లెకు వచ్చి స్థానికంగా మార్వారి వీధిలోని టీ హోటల్‌లో పనిచేస్తూ తలదాచుకున్నాడు. కేసు దర్యాప్తులో భాగంగా కలకత్తా పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు మదనపల్లెలో ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం ముగ్గురు పశ్చిమబెంగాల్ పోలీసులు మదనపల్లెకు చేరుకుని, టూటౌన్ పోలీసుల సాయంతో జిజాన్స్‌ను అరెస్ట్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి స్థానిక కోర్టులో హాజరు పరిచారు. అనంతరం నిందితుడిని కలకత్తాకు తరలించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

ఏడు పొట్టేళ్లు మృతి



మృతి చెందిన పొట్టేళ్లు

గుర్రంకొండ : గొర్రెల మందపై లారీ దూసుకెళ్లడంతో ఏడు పొట్టేళ్లు మృతి చెందగా తొమ్మిది గొర్రెలు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ ఎరుకలవానిమిట్ట వద్ద జరిగింది. కలకడ మండలం నడిమిచెర్ల గ్రామానికి చెందిన చంద్రమోహన్ అనే గొర్రెలకాపరి గొర్రెల మందను కాచుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలాలపై మందను నిలిపేందుకు మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ ఎరుకలవానిమిట్ట వద్ద ఉన్న పొలాల్లోకి తన గొర్రెల మందను తోలుకొచ్చాడు. మంగళవారం మందను సమీప గుట్టల్లో మేపుకొని తిరిగి పొలాల వైపు వస్తుండగా రాయచోటి నుంచి మదనపల్లె వైపు వెళుతున్న లారీ గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఏడు పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందగా తొమ్మిది గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన గొర్రెల పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు బాధిత గొర్రెల కాపరి తెలిపాడు. ఈ ప్రమాదంలో రూ.2లక్షల నష్టం వాటిల్లిందన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు.

పంచాయతీరాజ్‌లో సజావుగా బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ : పంచాయతీరాజ్ (పీఆర్) శాఖకు సంబంధించి అనంతపురంలోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి (రాయలసీమ జిల్లాలు) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, బాలాజీ (తిరుపతి), చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన డీఈఈలు, ఏఈఈలు, జేఈఈలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగింది. ఆ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బాలూనాయక్, ఎస్ఈ జహీర్ అస్లాం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈ మురళి, ఇతర జిల్లాల ఎస్ఈలతో పాటు పీఆర్ఐ ఈఈ ప్రభాకరరెడ్డి, అనంతపురం సబ్ డివిజన్–1, 2 డీఈఈలు లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి, సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్లు ఖాజా మొహిద్దీన్ తదితరులు పర్యవేక్షించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలనూ ఆమోదించారు.

లాంజ్ బాత్‌రూమ్‌లో యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు ఆర్టీసీ ప్రాంగణంలోని ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాంజ్ బాత్ రూమ్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం కారని మిట్టకు చెందిన ఎస్.విజయకుమార్ (26) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి రెండు నెలల క్రితం సమీప బంధువైన ఉషతో వివాహమైంది. సోమవారం విజయకుమార్ మదనపల్లెలోని వైద్యశాలకు వెళ్లాడు. డాక్టర్ సూచనల మేరకు మందులు తీసుకెళ్లేందుకు నెల్లూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న ఎంఎస్‌ఆర్ డీలక్స్ లాంజ్‌లో బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన లాంజ్ నిర్వాహకులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం నెల్లూరుకు చేరుకున్న బాధిత కుటుంబం విజయకుమార్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. మృతుని తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. ఎస్ఐ వీసీ సుబ్రమణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరపునాయునిపల్లెలో దారుణ హత్య



హత్యకు గురైన అనిమెల ఆంజనేయులు

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో మంగళవారం దారుణ హత్య జరిగింది. వీరపునాయునిపల్లెకు చెందిన అనిమెల ఆంజనేయులు అలియాస్ సుమో ఆంజనేయులు (45) మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బైకుపై ఇంటికి వెళుతుండగా కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు అటకాయించి గొంతు కోసి, కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. తమ ఇంటి వద్ద నివాసముంటున్న బెలుకూరి నరేష్, నవీన్‌లతో తమకు చాలా కాలంగా సమస్యలున్నాయని వారే ఈ హత్య చేసి ఉండవచ్చని మృతుడు ఆంజనేయులు భార్య కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చల్లని దొర ఆదేశాల మేరకు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి ఇంటర్ విద్యార్థి మృతి



దాసరి దేవా సాయి యల్లారెడ్డి (ఫైల్)

తొండూరు : తొండూరు మండలం ఊడవగండ్ల గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి దాసరి దేవా సాయి యల్లారెడ్డి(17) మంగళవారం ఈతకోసం వెళ్లి బావిలో మునిగి మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దాసరి దేవా సాయి యల్లారెడ్డి బంధువులతో కలిసి గ్రామంలోని బావి వద్దకు ఈతకు వెళ్లాడు. అందరూ సరదాగా ఈత కొడుతున్న క్రమంలో దేవసాయి ప్రమాదవశాత్తు బావిలోని మెటికల కింద ఉండిపోవడంతో శ్వాస ఆడక మృతి చెందాడు. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్‌లో నివాసముంటున్న వారం రామాంజులు (21) అనే యువకుడు ఈనెల 21వ తేదీన విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రామాంజులు చింతకొమ్మదిన్నెకు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. తల్లిదండ్రులు ఆ యువతి వరుస కాదని వివాహం చేసేందుకు అంగీకరించలేదు. దీంతో ఆవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీన మృతి చెందాడు.

పేదలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా లక్షా యాభై వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అమలు చేయకుండా వారిమీదే భారం వేస్తూ పరిపాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడు పేరుతో సంబరాలు చేసుకోవడం ప్రజలను అవమానించడమే అన్నారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, నలభై బెల్టుషాపులు పథకం అమలు చేశారని ఎద్దేవా చేశారు. అలాగే విద్యుత్‌చార్జీల పేరుతో రూ.15,480 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. కూటమి పాలనలో పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించడం అవమానకరమన్నారు. రాష్ట్రంలో రైతులకు ఏ ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేకుండా మహానాడులో భోజనాలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఏడాదిలో ఆత్మహత్య చేసుకున్న ఏ ఒక్క రైతుకు కూడా పంట నష్టపరిహారం చెల్లించలేదన్నారు. మహిళలపై అత్యాచారాలు, ఇసుక, మద్యం, మైనింగ్‌లలో విచ్చలవిడిగా దోపిడీలకు పాల్పడుతున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్

- ఫాం పాండ్స్ పనులకు రూ.25 కోట్ల వ్యయం
- పీడీ వెంకటరత్నం



ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ వెంకటరత్నం

బి.కొత్తకోట : జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేసిన సీసీ రోడ్లు, కూలీలకు రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మంగళవారం ఫాం పాండ్స్ పనులపై క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు నెలలుగా ఉపాధి ఎఫ్ఏ, టీఏలు, ఏపీఓలకు వేతనాలు అందలేదన్నారు. వీరికి త్వరలోనే వేతనాలు జమ అవుతాయని చెప్పారు. జిల్లాలో 11 వేల ఫాం పాండ్స్ నిర్మాణం కోసం పనులు చేపట్టగా.. ఇప్పటి దాకా 5,109ను రూ.25 కోట్ల వ్యయంతో పూర్తి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 71 వేల మంది ఉపాధి పనులు చేస్తుండగా.. అందులో 26 వేల మంది ఫాం పాండ్స్ పనులు చేస్తున్నారని తెలిపారు. నెల రోజులుగా ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్య పెరిగిందన్నారు. మండల ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తూ.. మండలానికి 225 కంపోస్టు యార్డులు మంజూరైనట్టు చెప్పారు. ఈ నెలఖారులోగా 263 ఫాం పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. 200 ఎకరాల్లో ఉద్యానవనాల పెంపకం లక్ష్యంగా నిర్ణయించామని, దీనిపై రైతులను గుర్తించి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీల సంఖ్యను 1,370కు పెంచాలని సూచించారు. యోగాంధ్ర యాప్‌లో ఉపాధి కూలీలను రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. సమావేశంలో ఏపీడీ నందకుమార్, ఏపీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయకుంటే చర్యలు

పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ పథకంలో భాగంగా సిబ్బందికి నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను నెలాఖరులోగా పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మండలంలోని క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఉన్నారు.

యోగాంధ్రకు సర్వం సిద్ధం



యోగా నిర్వహణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె రూరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలో బుధవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి మెగా యోగాకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసీ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్.. పట్టణంలోని బెంగళూరు రోడ్డు బీటీ కాలేజీ గ్రౌండ్స్‌లో యోగా కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. మైదానంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సుమారు 5,00 మంది యోగా చేసేందుకు అనువుగా మైదానంలో మ్యాట్ ఏర్పాటు చేయాలని, వచ్చిన వారందరికీ తాగునీటి ఏర్పాట్లు ఉంచాలన్నారు. యోగా ట్రైనర్, ఆసనాలకు సంబంధించి చెప్పే మాటలు అందరికీ వినపడేలా సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. యోగాలో పాల్గొనే అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, హెల్పర్లు, ఏఎన్ఎంలు, మెడికల్ అధికారులు, ఆశా కార్యకర్తలు క్రమశిక్షణతో సంఘటితంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్‌కు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహసీల్దార్ కె.ధనంజయులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ రమేష్‌బాబు, ఎంపీడీఓ తాజ్ మస్రూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడులకు పాల్పడితే చర్యలు

ప్రభుత్వ విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే.. వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హెచ్చరించారు. యోగాంధ్రలో భాగంగా నిర్వహిస్తున్న మెగా యోగ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణకు వచ్చిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరిని సచివాలయ సిబ్బంది కలుసుకున్నారు. కోళ్లబైలు–2 పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్ మోహన్‌పై సోమవారం పంచాయతీ వార్డు మెంబర్ సోమశేఖర్ దాడికి పాల్పడిన విషయమై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణానికి సంబంధించి అనుమతుల మంజూరు నిరాకరించినందుకు దాడి చేసినట్లు చెప్పారు. న్యాయం చేయాల్సిందిగా కోరారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి.. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. కోళ్లబైలు పంచాయతీ సర్వే నంబర్633/3లోని ప్రభుత్వస్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో నేలమట్టం చేసి తొలగించారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన వార్డు సభ్యుడిపై కేసు నమోదు చేయాల్సిందిగా ఆదేశించడంతో మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్.138/2025 బీఎన్ఎస్ సెక్షన్ 323, 324, 353, 506ల కింద కేసు నమోదు చేశారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడులు చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం చట్టపరంగా నేరమన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప దాడులు చేయడం సమంజసం కాదన్నారు.

ఆగిన వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు



గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఐదు అంతస్తుల భవన నిర్మాణ పనులు

రాయచోటి టౌన్ : రాయచోటికే తలమానికంగా నిలిచిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయం అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధి కోసం రూ. కోట్లు ఖర్చు చేశారు. అలాంటిది ఇప్పుడు ఒక్క పని కూడా ముందుకు సాగడం లేదు. ప్రధానంగా వీరభద్రస్వామి ఆలయానికి చెందిన పనుల్లో స్వామి వారి ఆలయానికి పడమర దిక్కున ప్రహరీకి ఆనుకొని ఉన్న ఆక్రమణల తొలగింపు అంశాన్ని అప్పటి ఎమ్మెల్యే, చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి ఎంతో చాకచక్యంగా పరిష్కరించారు. అంతే కాకుండా వారికి నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇంటి స్థలాలు కూడా కేటాయించి ఇళ్ల నిర్మాణాలకు సహకరించారు. ఆ వెంటనే పశ్చిమ రాజగోపురం రూ.158 కోట్లతో నిర్మించారు. అలాగే గర్భాలయంపై పిడుగు పడటంతో 2020లోనే మళ్లీ రూ.33 లక్షలతో పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. అనంతరం రూ.38 లక్షలతో మాఢవీధులు నిర్మించారు. చివరగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ఐదు అంతస్తుల భవనాలు నిర్మించేందుకు రూ.1.58 కోట్లతో 2023 జనవరి 26న పనులు ప్రారంభించారు. మూడు అంతస్తుల వరకు గోడలు కూడా పూర్తయ్యాయి. ఆ తర్వాత ఆ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పనులు ఆగిపోయిన విషయమై ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిని వివరణ కోరగా నూతన కమిటీ ఏర్పడ్డాక మిగిలిన పనులు పూర్తి చేయిస్తామన్నారు.

యువకులపై పోలీసుల దాడి దారుణం



మాట్లాడుతున్న మానవ హక్కుల నేతలు

పోరుమామిళ్ల : తెనాలిలో ముగ్గురు యువకులపై పోలీసులు నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానుషమని, చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకోవడం రాజ్యాంగరీత్యా నేరమని మానవహక్కుల సంఘం జిల్లా చీఫ్ గంగన్న, ప్రతినిధులు ఫణిరావు, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో దండించడం పక్కనపెట్టి బహిరంగంగా నడిరోడ్డుపై ముగ్గురు యువకులను కూర్చోబెట్టి అరికాళ్లపై లాఠీలతో మోదడం చూస్తున్నవారిని భయకంపితులను చేసిందన్నారు. అమానుషంగా ప్రవర్తించిన ఇద్దరు సీఐలపై చర్య తీసుకోవాలని కోరారు. రౌడీలను దారిలో పెట్టే పద్ధతి ఇదేనా అని ప్రశ్నించారు.